• భక్తులతో నిండిన 'మల్లన్న' క్షేత్రం



సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం ఆదివారం భక్తజన సంద్రమైంది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో ఆదివారం 30 వేల మంది భక్తులు తరలివచ్చారు. భక్తులు కేశ ఖండన, అభిషేకాలు, పట్నాలు, అర్చనలు, ఒడిబియ్యం, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలు అందించారు. - చేర్యాల



పునరావాస కాలనీలో లో నిర్మాణంలో ఉన్న ఇండ్లు

## 'కవ్వాల్' గ్రామాల తరలింపు వేగవంతం

- జోరుగా పునరావాస కాలనీ ఇండ్ల నిర్మాణం
- పనుల పురోగతిపై పీసీసీఎఫ్ డోబ్రియాల్ క్షేత్రస్థాయి సమీక్ష
- స్థానిక అధికారులతో కలిసి లబ్ధిదారులతో భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): కవ్వాల్ పులుల అభయారణ్యం నుంచి గ్రామాల తరలింపు ప్రక్రియ వేగవంతమైంది. ఈ ప్రక్రియతోపాటు పునరావాస కాలనీ పనుల పురోగతిపై అటవీ సంరక్షణ ప్రధానాధికారి ఆర్ఎం డోబ్రియాల్ ఆదివారం క్షేత్రస్థాయిలో సమీక్ష జరిపారు. కవ్వాల్‌లో ఆయన స్థానిక అధికారులతో కలిసి పునరావాస కాలనీని సందర్శించటంతో పాటు లబ్ధిదారులతో సమావేశమయ్యారు. మొదటి దశలో పునరావాసానికి రాంపూర్, మైసంపేట గ్రామాలు స్వచ్ఛందంగా అంగీకరించాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం అటవీ శాఖ రెండు ప్రతిపాదనలతో పనులను చేపట్టింది. గ్రామాల తరలింపులో భాగంగా ఒక్కో కుటుంబానికి ఏకమొత్తంగా రూ.15 లక్షల పరిహారాన్ని అందిచటం ఓ ప్రతిపాదన. దీనికి 48 కుటుంబాలు అంగీకరించి పరిహారం స్వీకరిస్తున్నాయి. రెండవ ప్రతిపాదనకు అంగీకరించిన 94 కుటుంబాలకు రూ.15 లక్షల పరిహారంలో భాగంగా ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి 333 చదరపు గజాల్లో ఓ ఇల్లు నిర్మించి ఇవ్వడంతోపాటు 2.81 ఎకరాల సాగు భూమిని సమకూర్చుతున్నది. వారి కోసం అటవీ ప్రాంతం వెలుపల కొత్త మద్దిపడగలో 12.36 ఎకరాల్లో అన్ని వసతులతో పునరావాస కాలనీని నిర్మిస్తున్నది. ఈ పనులన్నీ పూర్తి కాగానే లబ్ధిదారులకు ఇండ్లు అందజేస్తామని డోబ్రియాల్ తెలిపారు. ఆయనతోపాటు కవ్వాల్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారామ్, నిర్మల్, మంచిర్యాల డీఎఫ్‌వోలు, ఇతర అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో పాల్గొన్నారు.

# జోరుగా బెల్లం రీసైక్లింగ్

- భక్తులు సమర్పించిన వెంటనే తరలిస్తున్న వలంటీర్లు
- ప్రసాదంగా ఇవ్వాలని చెప్పినా పట్టించుకోని వైనం

ములుగు, ఫిబ్రవరి 18 (నమస్తేతెలంగాణ): భక్తులు కొంగు బంగారంగా భావించే మేడారం మహా జాతరలో అతి ముఖ్యమైనది బెల్లం ప్రసాదం. దీనిని భక్తులు బంగారంగా భావించి ప్రసాదాన్ని పంపిణీ చేసుకుంటారు. కోరిన కోర్కెలు తీరితే భక్తులు ఎత్తు బెల్లాన్ని తల్లులకు సమర్పిస్తారు. కొందరు భక్తులు తమ ఇండ్ల వద్ద ఎత్తు బెల్లాన్ని కొనుగోలు చేసి కొద్ది మొత్తంలో మేడారానికి తరలించి తల్లులకు సమర్పిస్తుంటారు. మరి కొంతమందరు మొక్కు ప్రకారం తమ బరువుకు సరితూగే బెల్లాన్ని మొత్తం తరలించి మేడారంలో తల్లుల గద్దెల వద్ద సమర్పిస్తారు. ఈ బెల్లాన్ని గద్దెల వద్ద వలంటీర్లుగా పనిచేస్తున్న వారు భక్తులకు ప్రసాదంగా అందించాలి. కానీ.. 10 కేజీల చొప్పున వచ్చే బెల్లం బుట్టలను వలంటీర్లు వెంటనే తీసుకెళ్లి ప్రత్యేక స్థలంలో భద్రపరుస్తున్నారు. చిన్న బెల్లం ముద్దలనే భక్తులకు ప్రసాదంగా ఇస్తున్నారు. ఈ బెల్లాన్ని బెల్లం మాఫియా రీసైక్లింగ్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నది.

### వాటాలపై పంచాయితీలు

మేడారం జాతరలో ఐటీడీఏ ఆధ్వర్యంలో 20 బెల్లం షాపులను గిరిజనులకు కేటాయించారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న బెల్లం వ్యాపారులు.. దుకాణాలను దక్కించుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి బెల్లాన్ని దిగుమతి చేసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కిలో బెల్లాన్ని 60 నుంచి 70 చొప్పున విక్రయిస్తున్నారు. జాతర సందర్భంగా 500 టన్నుల బెల్లాన్ని విక్రయించే అవకాశాలు ఉన్నాయి. గద్దెల వద్ద భక్తులు సమర్పించిన బెల్లాన్ని తిరిగి మార్కెట్‌లోకి పంపిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం. పాడైన బెల్లాన్ని గుడుంబా తయారీకి తరలిస్తున్నారనే పుకార్లు వినిపిస్తున్నాయి. బెల్లం వ్యాపారులతోపాటు కొందరు స్థానికుల మధ్య వాటాల పంచాయితీలు తలెత్తి భౌతిక దాడులకు దిగారు. అయినా.. రీసైక్లింగ్ దందాకు చెక్ పెట్టేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఘన, ప్లాస్టిక్ వ్యర్థాలు, బయో వ్యర్థాలపై యాత్రికులకు అవగాహన కల్పించింది.



### మేడారం.. జనసంద్రం

సమ్మక్క-సారలమ్మ దర్శనానికి ఆదివారం లక్షలాది మంది భక్తుల రాకతో మేడారం పరిసరాలు జనసంద్రంగా మారాయి. సమీపంలో పెద్దఎత్తున గుడారాలు వెలిశాయి. జంపన్న వాగులో పుణ్యస్నానాలు చేసి, అమ్మవార్ల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. తల్లులను శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ దర్శించుకున్నారు. గత రెండు నెలల కాలంలో 50 లక్షల మంది భక్తులు మేడారం సందర్శించినట్టు ఎస్పీ తెలిపారు. - తాడ్వాయి



గద్దెల వద్ద భక్తులు సమర్పించిన బెల్లం బుట్టలను భద్రపరుస్తున్న వలంటీర్లు

## ఆదరణకు నోచని జంపన్న!

- జంపన్న తర్వాతే తల్లుల రాక
- పట్టించుకోని దేవాదాయ శాఖ
- రేపు గద్దెకు చేరనున్న జంపన్న
- పూజా కార్యక్రమాల ప్రారంభం

తాడ్వాయి, ఫిబ్రవరి 18: మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరలో జంపన్నకు ఆదరణ కరువైంది. చరిత్ర కలిగిన సమ్మక్క తనయుడు, సారలమ్మ తమ్ముడు జంపన్నకు ప్రభుత్వ లాంఛనాలతో జాతర నిర్వహించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. జంపన్నవాగు జాతరలో ప్రత్యేక ఆదరణ కలిగి ఉంది. భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించాక తల్లుల దర్శనానికి వెళ్తారు. సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజులకు మాత్రమే దేవాదాయశాఖ అధికారులు జాతర నిర్వహిస్తున్న నేపథ్యంలో.. తాడ్వాయి మండలం కన్నెపల్లికి చెందిన పోలెబోయిన సత్యం, ఆయన తమ్ముడు శ్రీనివాస్, కుమారుడు సురేశ్ కలిసి సుమారు 2లక్షలకు పైగా ఖర్చులతో జంపన్నను సంపెంగవాగు ఒడ్డున గద్దెపై చేర్చి జాతర నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం గుర్తించి జంపన్న జాతరనూ నిర్వహించాలని పోలెబోయిన వంశీయులు కోరుతున్నారు.

### జంపన్న రాకతోనే జాతర షురూ..

మేడారం మహాజాతర ప్రారంభానికి ముందు జంపన్నను పోలెబోయిన వంశీయులు గద్దెకు తీసుకురావడం ఆనవాయితీ. 2024 మహాజాతరకు ఫిబ్రవరి 20న మంగళవారం సాయంత్రం జంపన్న గద్దెపైకి చేరనున్నాడు. ఆ తర్వాత 21న సారలమ్మ, 22న సమ్మక్క దేవతలు గద్దెకు చేరుకుంటారు. జంపన్న గద్దెను చేరాక బుధవారం సారలమ్మ జంపన్నను పలుకరించుకుంటూ వాగు నీళ్లలో నడుచుకుంటూ గద్దెపైకి చేరుకోవడం ఆనవాయితీగా వస్తున్నది.

### నేటి నుంచి లక్నవరం బంద్

గోవిందరావుపేట, ఫిబ్రవరి 18: ములుగు జిల్లా గోవిందరావు పేటలోని పర్యాటక ప్రాంతమైన లక్నవరం సందర్శనను సోమవారం నుంచి నిలిపివేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని చెప్పారు. ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున 26 వరకు లక్నవరం సందర్శనను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

## గైడ్‌గా 'మై మేడారం యాప్'

- అందుబాటులో వసతుల వివరాలు
- యాప్‌ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క, కలెక్టర్

ములుగు, ఫిబ్రవరి18 (నమస్తేతెలంగాణ): మేడారం మహా జాతరకు వచ్చే భక్తులు జాతర సౌకర్యాలు, చరిత్ర గురించి ఆన్‌లైన్‌లో సెల్‌ఫోన్ ద్వారా తెలుసుకునేందుకు ప్రభుత్వం 'మై మేడారం యాప్'ను అందుబాటులోకి తెచ్చింది. ఇది భక్తులకు ఓ గైడ్‌గా పనిచేయనుంది. నాటి ఎడ్లబండి నుంచి గాలిమోటర్ వరకు వచ్చిన సౌకర్యాలతోపాటు ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే జాతర విశేషాలు, ముఖ్యమైన ఘట్టాల సమాచారాన్ని ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఈ మేరకు శనివారం మంత్రి సీతక్కతోపాటు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ పీ శబరీష్ 'మై మేడారం యాప్'ను ఆవిష్కరించారు. ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్లే స్టోర్ ద్వారా 'మై మేడారం గైడ్ 2024' అనే పేరుతో అందుబాటులో ఉంది. యాప్ ద్వారా జాతరలోని తాగునీటి కేంద్రాలు, వైద్య శిబిరాలు, పార్కింగ్ ప్రాంతాలు, మరుగుదొడ్లు, స్నానఘట్టాల వివరాలు, తప్పిపోయిన వారి కోసం మైకల ద్వారా పిలిచే కేంద్రాలు, ఫైర్ ఇంజన్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చు.

## మేడారంలో వరుస ప్రమాదాలు

- రెండు రోజుల వ్యవధిలో ఇద్దరి మృతి

ములుగురూరల్, ఫిబ్రవరి18: ములుగు జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణ లేక వరుసగా వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు రోజుల వ్యవధిలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. శుక్రవారం జంగాలపల్లి వద్ద కారు ఢీకొట్టి మహిళ మృతి చెందగా, శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన యూటర్న్ వద్ద బస్సు ఢీకొని కానిస్టేబుల్ మృతి చెందాడు. ప్రతి రెండేండ్లకోసారి జరిగే మేడారం మహా జాతరకు ముందస్తు మొక్కులు చెల్లించేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులు వస్తున్నారు. 163వ జాతీయ రహదారి కావడంతో సుదూర ప్రాంతాల నుంచి ప్రైవేటు వాహనాల్లో వస్తున్నారు. అయితే.. జిల్లా కేంద్రంలో ఎక్కడ యూటర్న్‌లు ఉన్నాయో తెలియక వేగంగా వెళ్తున్నారు. దీంతో యూటర్న్‌ల వద్ద రోడ్డు దాటే ప్రయత్నం చేసే వారికి ప్రమాదం తప్పడం లేదు. దీనికితోడు డివైడర్ మధ్యలో మొక్కలను ఏర్పాటు చేసి వాటికి రక్షణగా కంచెను నిర్మించారు. ఈ కంచెకు కొందరు వ్యాపారులు, రాజకీయ నేతలు, స్వ చ్ఛంద సంస్థల వారు, ప్రైవేటు కంపెనీల వా రు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వీటి కారణం గా రోడ్డు దాటే వారికి అటుగా వచ్చే వాహనం కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



• సురేఖ, చిరంజీవి

## జీవన రేఖ.. సౌభాగ్య రేఖ.. నా భాగస్వామి సురేఖ..

చిరంజీవి ఎంత గొప్ప సూపర్‌స్టారో అంతగొప్ప ఫ్యామిలీ పర్సన్ కూడా. కుటుంబాన్ని అమితంగా ప్రేమిస్తారాయన. ముఖ్యంగా తన సతీమణి సురేఖకు ఆయనిచ్చే గౌరవం నిజంగా అభినందనీయం. నేడు సురేఖ పుట్టినరోజు. ఈ సందర్భంగా తన శ్రీమతిపై ఉన్న ప్రేమను కవిత రూపంలో వ్యక్తం చేశారు చిరంజీవి. 'నా జీవన రేఖ.. నా సౌభాగ్య రేఖ.. నా భాగస్వామి సురేఖ.. హ్యాపీ బర్త్‌డే' అంటూ ప్రత్యేకంగా ఓ కవిత రాసి, సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారాయన. అంతేకాదు, ఆమెతో కలిసి దిగిన ఓ ఫొటోను కూడా ఈ పోస్ట్‌కి జత చేశారు. ఇక ఆ పోస్ట్ సోషల్‌మీడియాలో ప్రత్యక్షమైన దగ్గర్నుంచి సురేఖకు శుభాకాంక్షలు వెల్లువలా వచ్చిపడుతున్నాయి. కొందరు అభిమానులైతే ఆ కవితను స్క్రీన్‌షాట్స్ తీసుకొని పోస్ట్ చేస్తున్నారు. కొందరేమో చిరంజీవి దంపతుల పిక్‌ని పోస్ట్ చేస్తున్నారు. మరోవైపు.. అత్తగారి పుట్టినరోజును పురస్కరించుకొని కోడలు ఉపాసన.. 'అత్తమ్మ కిచెన్' పేరుతో ఫుడ్ బిజినెస్ ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. దానికి సంబంధించిన ప్రొడక్ట్ ప్యాకెట్లను కూడా సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఏదిఏమైనా సురేఖకు ఇది గుర్తుంచుకోదగ్గ పుట్టినరోజు అని, అటు భర్త నుంచి ఇటు కోడలి నుంచి ఊహించని బహుమతులు అందుకోవడం నిజంగా ఆనందించదగ్గ విషయమే అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుంటే.. ప్రస్తుతం సతీసమేతంగా చిరంజీవి అమెరికాలో ఉన్నారు. పద్మవిభూషణ్ అందుకున్న తర్వాత పరిశ్రమనుంచి, అభిమానుల నుంచి వెల్లువెత్తిన అభినందనల తాకిడిని అనుభవించిన చిరంజీవి.. కాస్త విశ్రాంతి కోసం భార్యతో కలిసి అమెరికా వెళ్లారు. అక్కడ పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొంటున్నారని సమాచారం.

## పెను ప్రమాదం నుంచి బయపడ్డ నేషనల్‌క్రష్..

'ఈ రోజు మేం మృత్యువు నుంచి తప్పించుకున్నాం' అంటూ హీరోయిన్ శ్రద్ధాదాస్‌తో కలిసి దిగిన ఓ ఫొటోను తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది నేషనల్ క్రష్ రష్మిక. ఈ పోస్ట్ చూసిన ఆమె అభిమానులందరూ కంగారు పడిపోయారు. ఇక అసలు విషయంలోకి వెళ్తే.. ఇటీవల ముంబయ్ నుంచి హైదరాబాద్ విమానం ప్రయాణం చేసింది ఈ అందాలభామ. ఈ ప్రయాణంలోనే పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. ముంబయి నుంచి టేకాఫ్ అయిన 30 నిమిషాలకే రష్మిక ప్రయాణిస్తున్న విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దాంతో పైలెట్ చాకచక్యంగా విమానాన్ని ముంబయ్‌లోనే అత్యవసర ల్యాండింగ్ చేశాడు. దీంతో ప్రయాణంలోని వారంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ విమానంలో రష్మికతోపాటు మరో కథానాయిక శ్రద్ధాదాస్ కూడా ప్రయాణిస్తుండటం విశేషం. ఈ భయానక అనుభవాన్ని తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది రష్మిక. ఇక రష్మిక కెరీర్ విషయానికొస్తే.. ఇటు టాలీవుడ్, అటు బాలీవుడ్ సినిమాలతో ఆమె బిజీబిజీ. 'పుష్ప2', రెయిన్‌బో, ది గర్ల్‌ఫ్రెండ్, చావా ప్రస్తుతం ఆమె చేతిలోవున్న సినిమాలు.



రష్మిక



చిత్రం

• పవన్‌కల్యాణ్

## మాఫియాను చెండాడే ఓజీ

అటు రాజకీయాలు.. ఇటు సినిమాలు.. జోడు ఎడ్ల సవారీ చేస్తున్నారు పవన్‌కల్యాణ్. సుజిత్ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న 'ఓజీ' చిత్రం ఈ ఏడాది సెప్టెంబర్‌లో విడుదల కానుంది. ఈ సినిమా కథ విషయంలో ఆసక్తికరమైన అప్‌డేట్ ఒకటి సోషల్ మీడియాలో వినిపిస్తున్నది. ఇందులో పవన్ మాఫియా డాన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. కథ రీత్యా భయంకరమైన మాఫియా డాన్ అయిన పవన్‌కల్యాణ్, కొన్ని కారణాలవల్ల పదేళ్లపాటు మాఫియాకు దూరంగా ఉంటాడట. అనూహ్యంగా పదేళ్ల విరామం తర్వాత మళ్లీ మాఫియాపై విరుచుకు పడి, శత్రుమూక అంతు చూస్తాడట. ఇదే ఈ సినిమా ప్రధాన ఇతివృత్తమని టాక్ నడుస్తున్నది. మరి అందులో నిజం ఎంతుందో తెలియాలంటే సెప్టెంబర్ దాకా ఆగాల్సిందే. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, ప్రకాశ్‌రాజ్, అర్జున్ దాస్, షాన్ కక్కర్, హరీశ్ ఉత్తమన్, అభిమన్యుసింగ్, అజయ్‌ఘోష్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రాన్ని డీవీవీ దానయ్య నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



చైతన్య ప్రసాద్, సుహాస్, శివ కందుకూరి, పురుషోత్తంరాజ్ తదితరులు

## భాస్కర్‌నారాయణ శివస్తుతి..

శివ కందుకూరి హీరోగా రూపొందిన చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. పురుషోత్తం రాజ్ దర్శకుడు. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మాతలు. మార్చి 1న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలో శివుడ్ని కీర్తిస్తూ సాగే ఓ గీతాన్ని లెజెండ్రీ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి చేతులమీదుగా విడుదల చేశారు. చైతన్యప్రసాద్ సాహిత్యం అందించిన ఈ గీతాన్ని శ్రీచరణ్ పాకాల స్వరపరచగా కాలభైరవ ఆలపించారని చిత్రబృందం తెలిపింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హీరో సుహాస్‌తోపాటు దర్శకుడు విజయ్ కనకమేడల, వర్ష బొల్లమ్మ అతిథులుగా హాజరై చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'ఈ శివ గీతం ఈ ఆల్బమ్‌లో నా ఫేవరెట్. కీలక సమయంలో ఈ పాట వస్తుంది. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని హీరో శివ కందుకూరి నమ్మకం వ్యక్తం చేశారు. 'శివుడ్ని రావణాసురుడు ఎంత తీవ్రంగా పూజిస్తాడో, మా సినిమాలోని విలన్ కూడా అంత తీవ్రంగా పూజిస్తాడు. ఈ నేపథ్యంలో ఈ పాట ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు.



యానీయా భరద్వాజ్

## విజువల్ వండర్ ఇంద్రాణి..

యానీయా భరద్వాజ్, కబీర్ దుహాన్‌సింగ్ ప్రధానపాత్రధారులుగా రూపొందుతోన్న చిత్రం 'ఇంద్రాణి'. స్టెఫన్ పల్లం దర్శకుడు. స్టాన్లీ సుమన్‌బాబు నిర్మాత. ఈ మూవీ ట్రైలర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. అగ్ర సంగీత దర్శకుడు మణిశర్మ, నిర్మాత అనిల్‌సుంకర ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేశారు. చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'కథపై నమ్మకంతో ఈ సినిమా నిర్మించాం. వీఎఫ్ఎక్స్ వర్క్ కోసం ఏడాది కష్టపడ్డాం. ఈ సినిమా క్లైమాక్స్ ఊహలకు అందని స్థాయిలో ఉంటుంది. సాంకేతికంగా అన్ని విధాలుగా సినిమా బావుంటుంది. ఈ సినిమా ఇంత బాగా రావడానికి కారణం దర్శకుడే' అని నిర్మాత అన్నారు. అన్ని కమర్షియల్ హంగులతో కూడిన సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ ఇదని, రెండుగంటల నలభై నిమిషాల పాటు విజువల్ వండర్ చూసిన అనుభూతికి ప్రేక్షకులు లోనవుతారని, టైమ్ మిషిన్, రోబో ఇందులో కీలకంగా ఉంటాయని, రాబోవు యాభైఏళ్లల్లో ఇండియా ఎంత అడ్వాన్స్‌గా ఉండబోతుందో ఇందులో చూస్తారని దర్శకుడు తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు. త్వరలో ఈ సినిమా విడుదల కానుంది.

## ప్రయోగాత్మకంగా నేటిభారతం



శ్రీధర్‌రాజు

సామాజిక సందేశంతో రూపొందిన చిత్రం 'నేటిభారతం'. ఒకే పాత్రతో ఈ సినిమా రూపొందటం విశేషం. భరత్ పారేపల్లి దర్శకుడు. డా.యర్రా శ్రీధర్‌రాజు నటిస్తూ నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటున్నది. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. 'రాజకీయ వ్యవస్థవల్ల ప్రజలు అనుభవిస్తున్న అవస్థలను ఇందులో చూపించాం. శ్రీధర్‌రాజు పేషన్‌తో ఈ సినిమా చేశారు.' అని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సాంబేష్ చెప్పారు. 'కరోనా తర్వాత వచ్చిన ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులపై ఈ సినిమా ఉంటుంది. ఇందులో నేను జర్నలిస్ట్‌గా కనిపిస్తాను. తెరపై హీరో నేనే అయినా, తెరవెనుక హీరో పారేపల్లి భరత్‌గారే.' అని శ్రీధర్‌రాజు చెప్పారు. సినిమా విజయంపై దర్శకుడు పారేపల్లి భరత్ నమ్మకం వ్యక్తం చేశారు.

## థ్రిల్లింగ్ అంశాలతో ఫియర్

వేదిక లీడ్‌రోల్‌లో నటిస్తున్న థ్రిల్లర్ చిత్రం 'ఫియర్'. హరిత గోగినేని దర్శకత్వంలో ఏఆర్ అభి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. షూటింగ్ ప్రారంభించుకుని సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేశామని, డైరెక్టర్‌గా తొలి సినిమా అయినా క్లారిటీగా హరిత ఈ చిత్రాన్ని తెరకెక్కించారని, వేదికతోపాటు మిగతా ఆర్టిస్టులందరూ సహకరించడం వల్లే ఇంత త్వరగా సినిమా పూర్తి చేయగలిగామని, నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా త్వరలోనే పూర్తి చేసి థియేటర్లలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. అరవింద్ కృష్ణ, జె.పి, పవిత్రలోకేశ్, అనీష్ కురువిల్ల, సాయాజి షిండే, సత్య కృష్ణ, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఐ ఆండ్రూ, సంగీతం: అనూప్ రూబెన్స్, సహనిర్మాతలు: సుజాత రెడ్డి, సామ సురేందర్‌రెడ్డి, నిర్మాణం: దత్తాత్రేయ మీడియా.



జయప్రకాశ్, పవిత్ర లోకేష్, వేదిక , అరవింద కృష్ణ తదితరులు

## సమకాలీన సమస్యలపై రికార్డ్‌బ్రేక్



రగ్ధా ఇఫ్తాకర్, చదలవాడ శ్రీనివాసరావు, సత్యకృష్ణన్, టి. ప్రసన్నకుమార్ తదితరులు

చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రికార్డ్ బ్రేక్'. చదలవాడ పద్మావతి నిర్మాత. నిహార్, నాగార్జున, రగ్ధా ఇఫ్తాకర్ ముఖ్య పాత్రధారులు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని ఆదివారం ఘనంగా జరిపారు. సీనియర్ దర్శకుడు అజయ్‌కుమార్, సీనియర్ నిర్మాత రామసత్యనారాయణ, నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్ అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. 'అడవిరాముడు, వేటగాడు, దేవదాసు చిత్రాల ప్రేరణతో సినీరంగంలోకి అడుగుపెట్టాను. సమాజానికి ఉపయోగపడే కథతో సినిమా తీయాలనేది నా కోరిక. ఆ కోరిక నుంచి పుట్టుకొచ్చిన కథే 'రికార్డ్ బ్రేక్'. ఇందులో హీరో ఎవరూ ఉండరు. కథే హీరో. ఆర్ట్ డైరెక్టర్, ఫైట్ మాస్టర్, మ్యూజిక్ డైరెక్టర్ ఈ ముగ్గురు కూడా హీరోలే. చివరి 45 నిమిషాలు ఎమోషనల్‌గా ఉంటుంది. కచ్చితంగా అన్నిభాషల్లోనూ వండర్ క్రియేట్ చేస్తుంది' అని నమ్మకం వెలిబుచ్చారు చదలవాడ శ్రీనివాసరావు. ఇంకా యూనిట్‌సభ్యులందరూ మాట్లాడారు.